సాక్షి నిర్మల్

శుక్రవారం : 2 : ఫిబ్రవరి : 2024

I



పశుసంవర్ధక కార్యాలయం ముట్టడి

డీడీలు చెల్లించిన తమకు సబ్సిడీ గొర్రెల యూనిట్లు మంజూరు చేయాలని గొల్లకుర్మలు డిమాండ్‌ చేశారు. జిల్లా పశుసంవర్ధకశాఖ కార్యాలయాన్ని ముట్టడించారు. IIలో▸

అడవిపందులతో అగచాట్లు

రైతులు యాసంగి సీజన్‌లో సాగు చేసిన పంటలను ఒకవైపు చీడపీడలు ఆశిస్తే.. మరోవైపు అడవి జంతువులు ధ్వంసం చేస్తున్నాయి.



IIIలో▸

గరిష్టం/కనిష్టం
31.1 /18.4

వాతావరణం

వాతావరణం పొడిగా ఉంటుంది. ఉష్ణోగ్రతలు సాధారణంగా నమోదవుతాయి. వేకువజామున చల్లగా ఉంటుంది. ఉదయం పొగమంచు కురుస్తుంది.

న్యూస్‌రీల్‌

సదరం షెడ్యూల్‌ ఖరారు

నిర్మల్‌చైన్‌గేట్‌: జిల్లా గ్రామీణాభివద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఫిబ్రవరి, మార్చి మాసాల్లో సదరం క్యాంపుల తేదీలను జిల్లా గ్రామీణాభివృద్ధి అధికారి విజయలక్ష్మి గురువారం ప్రకటించారు. ఈ నెల 6న ఆర్థో, అంగవైకల్యం సీపీఏ, 9న వినికిడి, 21న మానసిక వికలాంగులకు, 28న కంటి సంబంధిత, మార్చి 6న ఆర్థో, అంగవైకల్యం సీపీఏ, 20న వినికిడి, 22న మానసిక వికలాంగలకు, 27న కంటి సంబంధిత శిబిరాలు ఉంటాయన్నారు. అర్హులైన వారు తమ పరిధిలోని పీహెచ్‌సీ వైద్యునిచే అ వుట్‌ పేషెంట్‌ స్లిప్‌ ద్వారా దివ్యాంగ కేటగిరీ నిర్ధారించుకుని మీ సేవలో ఈ నెల 3 నుండి దరఖాస్తు చేసుకోవాలన్నారు. మీసేవ ద్వారా స్లాట్‌ బుక్‌ చేసుకున్న వారు మాత్రమే సదరం క్యాంపులకు ఉదయం 9 గంటలకు స్థానిక ప్రభుత్వ జనరల్‌ ఆసుపత్రిలో హాజరు కావాలన్నారు.

కేసీఆర్‌ను కలిసిన 'అల్లోల'



కేసీఆర్‌కు శుభాకాంక్షలు తెలుపుతున్న ఐకేరెడ్డి

నిర్మల్‌టౌన్‌: ఎమ్మెల్యేగా గురువారం ప్రమాణ స్వీకారం చేసిన బీఆర్‌ఎస్‌ అధినేత, మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్‌ను మాజీ మంత్రి ఐకేరెడ్డి గురువారం అసెంబ్లీలో కలిసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా వచ్చే పార్లమెంటు ఎన్నికలపై వారిరువురూ చర్చించారు.

రాజకీయ కక్షతోనే కేజ్రీవాల్‌కు ఈడీ నోటీసులు

నిర్మల్‌చైన్‌గేట్‌: ఆమ్‌ ఆద్మీ పార్టీ జాతీయ అధ్యక్షుడు, ఢిల్లీ సీఎం అరవింద్‌ కేజ్రీవాల్‌ను రానున్న పార్లమెంట్‌ ఎన్నికల్లో ప్రచారం చేయకుండా అడ్డుకోవడమే లక్ష్యంగా బీజేపీ ఈడీని ఉపయోగించి అరెస్టు చేయాలని కుట్ర చేస్తోందని ఆపార్టీ నిర్మల్‌ జిల్లా కన్వీనర్‌ సయ్యద్‌ హైదర్‌ గురువారం ఒక ప్రకటనలో ఆరోపించారు. ఎంపీ ఎన్నికల్లో ఆమ్‌ ఆద్మీ పార్టీ 40 పైగా సీట్లు కైవసం చేసుకుంటుందనే భయంతో బీజేపీ ఇలాంటి చర్యలకు పాల్పడుతోందన్నారు. కేజ్రీవాల్‌ను అరెస్టు చేస్తే భారీ మూల్యం చెల్లించుకోక తప్పదని హెచ్చరించారు.


సీటీస్కాన్‌ సేవలు సద్వినియోగం చేసుకోవాలి

నిర్మల్‌చైన్‌గేట్‌: జిల్లా జనరల్‌ ఆస్పత్రిలో సిటీ స్కాన్‌ సేవలు సద్వినియోగం చేసుకోవాలని మెడికల్‌ కళాశాల ప్రిన్సిపాల్‌ జేవీడీ ప్రసాద్‌ అన్నారు. ఆస్పత్రికి సిటీ స్కాన్‌ సేవలు అందుబాటులోకి వచ్చి ఏడాది పూర్తయిన సందర్భంగా కేక్‌ కట్‌ చేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా జనరల్‌ ఆస్పత్రిగా అప్‌గ్రేడ్‌ అయిన తర్వాత జిల్లా ప్రజలకు ఖరీదైన సేవలు ఉచితంగా అందజేస్తున్నామన్నారు. ఏడాది కాలంలోనే దాదాపు 2000కు పైగా సిటీస్కాన్‌ సేవలు జిల్లా ప్రజలకు అందించామన్నారు. ఈ కార్యక్రమంలో మెడికల్‌ కాలేజ్‌ వైస్‌ ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ శ్రీనివాస్‌, రేడియాలజిస్ట్‌ డాక్టర్‌ సుహాస్‌రెడ్డి, రేడియో గ్రాఫర్‌ అబూ అమీర్‌ హైమద్‌, రేడియాలజీ సిబ్బంది పాల్గొన్నారు.

సదరం తిప్పలు తప్పించాలి

నిర్మల్‌చైన్‌గేట్‌: సదరం తిప్పలు తప్పించాలని కోరుతూ మీసేవ కేంద్రాల సంఘం ఆధ్వర్యంలో గురువారం డీఆర్డీవో విజయలక్ష్మి, ఈడీఎం నదీమ్‌కు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సదరం స్లాట్‌లను స్వల్పంగా ఇస్తుండటంతో ముందుగా ఉన్న వారికే అవకాశం దక్కుతోందన్నారు. స్లాట్‌లు కూడా నిమిషాల్లోనే పూర్తవుతున్నాయన్నారు. తెల్లవారకముందు నుండే మీసేవ కేంద్రాల వద్ద పడిగాపులు కాసినా వృద్ధులు, దివ్యాంగులకు అవకాశం దక్కని పరిస్థితి ఎదురవుతోందన్నారు. మండలాల వారీగా క్యాంప్‌లు పెట్టి స్లాట్‌లను పెంచాలన్నారు. వినతిపత్రం అందజేసిన వారిలో నాయకులు మేరుగు పవన్‌కుమార్‌, రాస అశ్విన్‌కుమార్‌, కూన రమేశ్‌, అలీం, ప్రవీణ్‌కుమార్‌, రాజేందర్‌, బిట్లింగ్‌ శ్రీనివాస్‌, తదితరులు పాల్గొన్నారు.

విపత్తులపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ఎన్డీఆర్‌ఎఫ్‌ సిబ్బంది

కడెం: మండల కేంద్రంలోని జిల్లా పరిషత్‌ పాఠశాలలో గురువారం పదో ఎన్డీఆర్‌ఎఫ్‌ బెటాలియన్‌ బృందం ప్రకృతి విపత్తులపై విద్యార్థులకు అవగాహన కల్పించింది. వరదలు, భూకంపాలు, అగ్ని ప్రమాదాలు, రోడ్డు ప్రమాదాలు, తదితర విపత్తులు సంభవించినపుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై వివరించారు. తహసీల్దార్‌ సుజాత, ఆర్‌ఐ లక్ష్మణ్‌, ఏ ఎస్సై భీంరావు, ఎంపీడీవో వెంకటేశ్వర్లు, ఎన్డీఆర్‌ఎఫ్‌ కమాండర్‌ ఇన్‌స్పెక్టర్‌ పింటునంది, టీం సభ్యులు రాజేశ్వర్‌రెడ్డి, అనిల్‌, ప్రవీణ్‌కుమార్‌, హెచ్‌ఎం శ్రీనివాస్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

మధ్యతరగతికి ఊరట



- ఆశ నిరాశల పద్దు..
- పేదలకు ఇళ్లు.. సోలార్‌ వెలుగులు
- బాలికలకు వ్యాక్సినేషన్‌
- కొత్త రైలుకు మార్గం చూపలేదు
- జిల్లాకు ఈ'సారీ' మొండిచేయే..
- కేంద్ర బడ్జెట్‌పై మిశ్రమ స్పందన

నిర్మల్‌: కేంద్ర ఆర్థికమంత్రి నిర్మలమ్మ ఈసారీ నిర్మల్‌ జిల్లాను కరుణించలేదు. పార్లమెంట్‌లో గురువారం ప్రవేశపెట్టిన మధ్యంతర బడ్జెట్‌ మధ్యతరగతికి కొంత ఊరటనివ్వడం తప్ప పెద్దగా ఎక్కడా ఆకట్టుకోలేదు. కేంద్ర బడ్జెట్‌ ద్వారా పేద, మహిళ, యువత, అన్నదాతలకు కొంత మేలు అందుతున్నా.. జిల్లాకు మాత్రం నేరుగా ఎలాంటి లబ్ధి కనిపించకపోవడంపై జిల్లావాసులు పెదవి విరుస్తున్నారు. పార్లమెంట్‌ ఎన్నికల వేళ ప్రవేశపెట్టిన పద్దుపై పెద్దగా ఆశలు పెట్టుకున్నప్పటికీ ఆశ నిరాశలతోనే బడ్జెట్‌ ముగిసిందన్న వాదన ఉంది. మరోవైపు మధ్యంతర బడ్జెట్‌ కావడంతోనే కేంద్రం పెద్దగా మార్పులు చేర్పులను చేపట్టలేదని చెబుతున్నారు.

ఇళ్లు, వెలుగులు..

కేంద్ర బడ్జెట్‌లో పెద్దగా ఆకట్టుకునే అంశాలు లేవు. కొన్ని ప్రకటనలు మాత్రం పేద, మధ్యతరగతిని ఊరడించేలా ఉన్నాయి. ప్రధానంగా 2 కోట్లమంది పేదలకు పీఎం ఆవాస్‌ యోజన ద్వారా ఇళ్లు కట్టించడం ఆకట్టుకుంది. జిల్లాలో గతంలో ఇందిరమ్మ, డబుల్‌ బెడ్రూం పథకాల ద్వారా కొత్త ఇళ్లు కట్టించినప్పటికీ ఇంకా సొంతింటి కల నెరవేరనివారు ఉన్నారు. ఇలాంటి వారికి పీఎం ఆవాస్‌ యోజన ద్వారా కొంత ఆసరా దొరికే అవకాశం ఉంది. విద్యుత్‌ బిల్లుల మోతపై కేంద్రం చేసిన ప్రకటన కొంత ఆసక్తికరంగా ఉంది. 300 యూనిట్లు ఉచితంగా దక్కేలా ప్రణాళిక ప్రకటించింది. ఇందులో భాగంగా 'రూఫ్‌టాప్‌ సోలార్‌' చేపట్టనున్నట్లు పేర్కొంది.

పేదలకు ప్రాధాన్యత..

కేంద్ర బడ్జెట్‌లో పేదలకు ప్రాధాన్యతనిచ్చారు. గరీబ్‌ కళ్యాణ్‌.. దేశ్‌ కళ్యాణ్‌ అంటూ 78 లక్షల వీధి వ్యాపారులకు పీఎంస్వానిధి పథకం కింద చేయూతనిచ్చినట్లు చెప్పారు. మహిళలకు స్వయం సహాయక సంఘాల ద్వారా మరింత ప్రోత్సాహాన్ని అందిస్తామన్నారు. ఆయుష్మాన్‌ భారత్‌ పథకం ఆశా, అంగన్‌వాడీ కార్యకర్తలకు వర్తింపజేశారు. ఆదాయ పన్ను స్లాబుల్లో ఎలాంటి మార్పులు లేవు.

బాలికలకు వరంగా..

ప్రపంచంలో అత్యధికంగా దేశంలోనే మహిళలు సర్వైకల్‌ క్యాన్సర్‌ బారిన పడుతున్నారని, దీన్ని అరికట్టడానికి వ్యాక్సినేషన్‌ ఇవ్వనున్నట్లు నిర్మల సీతారామన్‌ ప్రకటించారు. దేశంలో 9 నుంచి 14ఏళ్ల లోపు బాలికలకు ఉచితంగా సర్వైకల్‌ క్యాన్సర్‌ వ్యాక్సినేషన్‌ చేపడతామని ప్రకటించారు. విద్యతో పాటు వైద్యరంగాన్ని బలోపేతం చేసేదిశగా చర్యలు కొనసాగిస్తామన్నారు. ఇందులో భాగంగా మరిన్ని మెడికల్‌ కాలేజీలను పెంచనున్నట్లు కేంద్రమంత్రి బడ్జెట్‌లో పేర్కొన్నారు.

జిల్లాకు మళ్లీ నిరాశే..

కేంద్ర బడ్జెట్‌లో జిల్లాకు ఈసారి కూడా నిరాశ తప్పలేదు. ఉమ్మడి జిల్లాలో ఆసిఫాబాద్‌కు పారిశ్రామిక అభివృద్ధిలో భాగం కల్పించినప్పటికీ నిర్మల్‌కు మాత్రం ప్రాధాన్యత దక్కలేదు. ప్రధానంగా జిల్లా మీదుగా రైల్వేలైన్‌ నిర్మాణానికి సంబంధించి నిధుల మంజూరుపై స్పష్టత ఇవ్వలేదు. గత సెప్టెంబర్‌లో ఆదిలాబాద్‌–నిర్మల్‌–నిజామాబాద్‌–సంగారెడ్డి మీదుగా పటాన్‌చెరు వరకు రూ.5,706 కోట్లతో రైల్వేలైన్‌ చేపడతామని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి ప్రకటించారు. ఈమేరకు ఈ బడ్జెట్‌లో సంబంధిత లైన్‌పై ప్రకటన లేకపోవడం నిరాశకు గురిచేసింది. మరోవైపు ఇది మధ్యంతర బడ్జెట్‌ మాత్రమేనని, రైల్వేలైన్‌కు ప్రత్యేక కేటాయింపులు చేస్తారన్న వాదన ఉంది. పరిశ్రమలు, పర్యాటక రంగాలకూ ఎలాంటి ప్రత్యేక కేటాయింపులు చేయలేదు. కొత్తగా ఏర్పడ్డ జిల్లాల్లో నవోదయ, కేంద్రీయ, సైనిక విద్యాలయాల ఏర్పాటు ఊసేలేదు. మొత్తం మీద కేంద్ర మధ్యంతర బడ్జెట్‌ ఆశనిరాశల పద్దుగా నిలిచింది.

పన్ను స్లాబుల్లో మార్పుల్లేవ్‌



ఈసారి ఆదాయ పన్ను స్లాబులలో ఎలాంటి మార్పులు లేవు. గతేడాది స్లాబులే వర్తిస్తాయి. 2010 ఆర్థిక సంవత్సరం వరకు ఎవరైనా ఇన్‌కంటాక్స్‌ బకాయిలు ఉంటే రూ.25వేల వరకు మాఫీ చేశారు. ఆర్థిక సంవత్సరం 2011–15 వరకు బకాయిలు రూ.10 వేల వరకు మాఫీ చేశారు. దీనిద్వారా కోటిమంది టాక్స్‌పేయర్స్‌ లబ్ధిపొందుతారు.

– ముక్క సాయిప్రసాద్‌, సీఏ, నిర్మల్‌

వేతన జీవులకు మొండిచేయి..



కేంద్రం ప్రవేశపెట్టిన తాత్కాలిక బడ్జెట్‌లో ఆదాయపన్ను చెల్లించే వర్గాలకు ఊరట లభించలేదు. స్కిల్‌ ఇండియా ద్వారా 1.4కోట్ల యువతకు శిక్షణనివ్వడం మంచి కార్యక్రమం. 'సోలార్‌ రూఫ్‌టాప్‌' ద్వారా కోటి ఇళ్లకు 300 యూనిట్ల వరకు ఉచిత విద్యుత్‌ ఇవ్వడం బాగుంది. ఆదాయపన్ను వర్గాలకు మరింత ఊరట కల్పించాల్సింది.

– భూమన్నయాదవ్‌, ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు

అన్నివర్గాలకు సంక్షేమం



కేంద్రంలోని నరేంద్ర మోదీ ప్రభుత్వం సబ్‌కా సాథ్‌, సబ్‌కా వికాస్‌, సబ్‌కా విశ్వాస్‌ లక్ష్యంగా సాగుతోంది. ఇందులో భాగంగానే తాత్కాలిక బడ్జెట్‌లోనూ అన్నిరంగాల సంక్షేమం కోసం కేటాయింపులు చేపట్టింది. పేదలకు ఇళ్లతో పాటు ఉచిత విద్యుత్‌ అందించేలా సోలార్‌ రూఫ్‌టాప్‌ పథకం తీసుకురావడం హర్షనీయం.

– అంజుకుమార్‌రెడ్డి, బీజేపీ జిల్లా అధ్యక్షుడు

రైల్వే కేటాయింపుల్లేవ్‌



కేంద్ర బడ్జెట్‌లో తెలంగాణకు ప్రధానంగా జిల్లాకు మొండిచేయి చూపింది. రైల్వేలైన్‌లకు కేటా యింపులు నామమాత్రంగా ఉన్నాయి. జిల్లావాసులు దశాబ్దాలుగా పెట్టుకున్న ఆదిలాబాద్‌–నిర్మల్‌–ఆర్మూర్‌ మార్గంపై ఈ బడ్జెట్‌లోనూ ఎలాంటి ప్రకటన చేయలేదు. పారిశ్రామికపరంగానూ ఎలాంటి కేటాయింపులు చేయకపోవడం దారుణం.

– కొట్టె శేఖర్‌, తెలంగాణ ఉద్యమకారుల ఫోరం ఉమ్మడి జిల్లా చైర్మన్‌

బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు కృషిచేయాలి

- ఎస్పీ జానకి షర్మిల



ఎస్పీ జానకి షర్మిల

నిర్మల్‌ఖిల్లా: బాలకార్మిక వ్యవస్థ నిర్మూలనకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని ఎస్పీ జానకి షర్మిల గురువారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. జనవరి 1 నుంచి 31 వరకు కొనసాగిన ఆపరేషన్‌ స్మైల్‌ కార్యక్రమంలో 69 మంది బాలకార్మికులకు విముక్తి కల్పించామన్నారు. ఇందులో 62 మంది బాలురు, ఏడుగురు బాలికలు ఉన్నారని పేర్కొన్నారు. నిర్మల్‌ డివిజన్‌ పరిధిలో 43 మంది, భైంసా డివిజన్‌ పరిధిలో 26 మందిని గుర్తించామన్నారు. బాలల్ని తప్పనిసరిగా పాఠశాలల్లో చేర్పించాలని లేదంటే కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. శారీరకంగా, మానసికంగా, లైంగిక దోపిడికి గురవుతున్న బాలలను గుర్తిస్తే 1098 లేదా 100కు ఫోన్‌ చేసి సమాచారం ఇవ్వాలని సూచించారు. ఆపరేషన్‌ స్మైల్‌ బృందంలో విధులు నిర్వహించిన పోలీస్‌ అధికారులు, సిబ్బందికి అభినందనలు తెలిపారు.

ఫోన్‌ పోతే ఆందోళన వద్దు



బాధితులకు ఫోన్‌ అప్పగిస్తున్న ఎస్పీ

నిర్మల్‌టౌన్‌: ఫోన్‌ పోగొట్టుకున్న బాధితులు ఆందోళన చెందవద్దని, పోలీస్‌ స్టేషన్‌ లేదా మీసేవ ద్వారా ఫిర్యాదు చేయాలని ఎస్పీ జానకి షర్మిల సూచించారు. జిల్లాలోని వివిధ పోలీస్‌స్టేషన్ల పరిధిలో పోగొట్టుకున్న 63 ఫోన్లను స్వాధీనం చేసుకుని గురువారం ఎస్పీ చేతుల మీదుగా బాధితులకు అందజేశారు. ఇప్పటి వరకు బాధితులు పోగొట్టుకున్న 492 ఫోన్లను గుర్తించి అప్పగించామన్నారు.

ఎస్పీకి వినతి

మార్చిలో జరుగనున్న ఇంటర్‌ వార్షిక పరీక్షల ప్రశ్నపత్రాల భద్రతపై డీఐఈవో జాదవ్‌ పరశురాం గురువారం ఎస్పీ జానకి షర్మిలకు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో ప్రశ్నపత్రాలు పట్టణ పోలీస్‌ స్టేషన్‌, స్ట్రాంగ్‌ రూంలో భద్రపరిచే వారిమని ప్రస్తుతం స్ట్రాంగ్‌ రూమ్‌ తొలగించారన్నారు. స్పందించిన ఎస్పీ ప్రశ్న పత్రాలు ఎస్పీ కార్యాలయంలో భద్రపరచుకోవాలని సూచించారు.

ఎస్పీని కలిసిన అదనపు కలెక్టర్‌

ఇటీవల నూతనంగా బాధ్యతలు స్వీకరించిన ఎస్పీ డాక్టర్‌ జానకి షర్మిలను జిల్లా కేంద్రంలోని ఎస్పీ కార్యాలయంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్‌ ఫైజాన్‌ అహ్మద్‌ గురువారం మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఎస్పీకి పూల మొక్క అందించి శుభాకాంక్షలు తెలిపారు.

సీఎం కరుణిస్తాడని..



సభ ఏర్పాట్లు పరిశీలిస్తున్న ఇన్‌చార్జి మంత్రి సీతక్క, ఎమ్మెల్యేలు వెడ్మ బొజ్జు, విజయరమణారావు

- నేడు ఇంద్రవెల్లికి ముఖ్యమంత్రి రేవంత్‌ రాక
- సెంటిమెంట్‌ జిల్లాపై వరాలు కురిపించేనా?
- గంపెడాశతో ఎదురుచూస్తున్న జిల్లావాసులు
- ముందుగా నాగోబా ఆలయంలో పూజలు
- ఇంద్రవెల్లి స్తూపం వద్ద అమరులకు నివాళి
- అధికారిక పర్యటనకు ఇక్కడి నుంచే శ్రీకారం
- పార్లమెంట్‌ ఎన్నికలకు సమర శంఖారావం

కైలాస్‌నగర్‌/ఇంద్రవెల్లి: సీఎం ఎనుముల రేవంత్‌రెడ్డి శుక్రవారం ఆదిలాబాద్‌ జిల్లాలో పర్యటించనున్నారు. తాను సెంటిమెంట్‌గా భావిస్తున్న ఇంద్రవెల్లి నుంచే తొలి అధికారిక పర్యటనకు శ్రీకారం చుట్టారు. దీంతో జిల్లావాసుల్లో కొత్త ఆశలు చిగురిస్తున్నాయి. ఎన్నికలకు ముందు కాంగ్రెస్‌ అధికారంలోకి వస్తే జిల్లాను దత్తత తీసుకుని మరీ అభివృద్ధి చేస్తానని ప్రకటించిన రేవంత్‌రెడ్డి సీఎం హోదాలో అధికారిక పర్యటనకు వస్తుండటంతో జిల్లాపై ఎలాంటి వరాలు కురిపిస్తారోనని సర్వత్రా ఆసక్తిగా ఎదురుచూస్తున్నారు. నాగోబా దర్శనంతో మొదలయ్యే సీఎం పర్యటన జిల్లాలో 4.35గంటల పాటు కొనసాగనుంది. సభను జయప్రదం చేసేందుకు జిల్లా యంత్రాంగం రెండ్రోజులుగా ఇంద్రవెల్లిలోనే మకాం వేసి ఏర్పాట్లు పర్యవేక్షిస్తోంది. త్వరలో జరగనున్న పార్లమెంట్‌ ఎన్నికలకు ఇదే సభ నుంచి సీఎం శంఖారావం పూరించనున్న నేపథ్యంలో కాంగ్రెస్‌ శ్రేణులు కూడా ఈ సభను ఎంతో ప్రతిష్టాత్మకంగా తీసుకున్నాయి. జిల్లాలోని ప్రతీ గ్రామం నుంచి ప్రజలను తరలించేలా పార్టీ నాయకులు ప్రణాళిక ప్రకారం ముందుకుసాగుతున్నారు. ఇందుకు మండలాల వారీగా నాయకులకు బాధ్యతలు అప్పగించారు.

పకడ్బందీ ఏర్పాట్లు

సీఎంగా రేవంత్‌రెడ్డి బాధ్యతలు చేపట్టాక నిర్వహిస్తున్న తొలి అధికారిక పర్యటన కావడంతో విజయవంతం చేసేందుకు జిల్లా అధికార యంత్రాంగం కృషి చేస్తోంది. ఎలాంటి లోటుపాట్లు తలెత్తకుండా పకడ్బందీ ఏర్పాట్లు చేస్తోంది. అమరుల స్తూపం వద్ద నిర్వహించే బహిరంగ సభకు ఇప్పటికే అన్ని ఏర్పాట్లు పూర్తి చేశారు. హెలిప్యాడ్‌తో పాటు సభావేదిక, ప్రాంగణాన్ని సుందరంగా తీర్చిదిద్దారు. సభకు హాజరయ్యే వారికి ఇబ్బందులు కలగకుండా సరిపడా కుర్చీలు ఏర్పాటు చేశారు. సాయంత్రం సభ జరగనుండటంతో ప్రత్యేక లైటింగ్‌ సిస్టం ఏర్పాటు చేస్తున్నారు. వాహనాల పార్కింగ్‌ కోసం ప్రత్యేక మైదానాన్ని సిద్ధం చేశారు. సీఎం జిల్లాకు చేరుకుని తిరిగి వెళ్లేలోపు జరిగే కార్యక్రమాలన్నింటినీ విజయవంతం చేసేలా జిల్లా అధికారులకు ప్రత్యేక బాధ్యతలు అప్పగించారు. కలెక్టర్‌ రాహుల్‌ రాజ్‌, ఎస్పీ గౌస్‌ ఆలాం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో కుష్బూ గుప్తా దగ్గరుండి ఏర్పాట్లు పర్యవేక్షిస్తున్నారు.

ఏర్పాట్ల పరిశీలన

నాగోబా దర్బార్‌ హాల్‌లో ఏర్పాటు చేసిన స్టాళ్లను ఆదిలాబాద్‌ ఎస్పీ గౌస్‌ ఆలాం, ఐటీడీఏ ఇన్‌చార్జి పీవో ఖుష్బూ గుప్తాతో కలిసి పరిశీలించారు. పంచాయతీరాజ్‌ శాఖ సీఎస్‌ సందీప్‌ సుల్తానియా, గిరిజన సంక్షేమ శాఖ సీఎస్‌ శరథ్‌ నాగోబా ఆలయంతో పాటు దర్బార్‌ హాల్‌, అమరుల స్తూపం వద్ద ఏర్పాట్లు పరిశీలించారు. నాగోబా దర్బార్‌ హాల్‌లో సీఎం రేవంత్‌రెడ్డి 400 మంది స్వయం సహాయక సంఘాల సభ్యులతో సమావేశం కానున్నారు. వీరికి ఉపాధి కల్పిస్తున్న పలు స్టాళ్లను పరిశీలించనున్నారు.

రెండు గ్యారంటీలు ప్రారంభం!

ఎన్నికల్లో ఇచ్చిన హామీలో భాగంగా రెండు గ్యారంటీలను ఇంద్రవెల్లి సభ నుంచే సీఎం రేవంత్‌రెడ్డి ప్రారంభించనున్నట్లు జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క తెలిపారు. సీఎం పర్యటన ఏర్పాట్లను సీతక్క ఖానాపూర్‌ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జుతో కలిసి పరిశీలించారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. సీఎం ఆదిలాబాద్‌ జిల్లాను దత్తత తీసుకుని అభివృద్ధి పథంలో ముందుకు తీసుకెళ్లడానికి కృషి చేస్తున్నారని తెలిపారు.

భారీ బందోబస్తు

సీఎం పర్యటన నేపథ్యంలో ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌ నాగోబా ఆలయం, అమరుల స్తూపం వద్ద ఎస్పీ గౌస్‌ ఆలాం ఆధ్వర్యంలో సుమారు 1200 మంది పోలీసులతో భారీ బందోబస్తు ఏర్పాటు చేశారు. నాగోబా ఆలయంతో పాటు అమరుల స్తూపం వద్ద సీఎం ప్రత్యేక సెక్యూరిటీ అధికారులు గురువారం తనిఖీలు నిర్వహించారు.

పర్యటన సాగేదిలా..

సీఎం రేవంత్‌రెడ్డి శుక్రవారం మధ్యాహ్నం 12.20గంటలకు హైదరాబాద్‌లోని బేగంపేట విమానాశ్రయం నుంచి ప్రత్యేక హెలిక్యాప్టర్‌లో బయలుదేరి మధ్యాహ్నం 1.30గంటలకు ఇంద్రవెల్లి మండలం కేస్లాపూర్‌కు చేరుకుంటారు. అక్కడి నుంచి రోడ్డు మార్గంలో నాగోబా ఆలయానికి బయలుదేరుతారు. 1.45నుంచి 2.15 గంటలవరకు నాగోబాను దర్శించుకుని ప్రత్యేక పూజలు చేస్తారు. ఆలయ గోపురంతో పాటు వివిధ అభివృద్ధి పనులు ప్రారంభిస్తారు. 2.15 నుంచి 3.15గంటల వరకు నాగోబా దర్బార్‌ హాల్‌లో అభివృద్ధి కార్యక్రమాలపై జిల్లా అధికారులు, ప్రజాప్రతినిధులతో సమావేశం నిర్వహిస్తారు. 3.15గంటలకు అక్కడి నుంచి రోడ్డు మార్గంలో బయలుదేరి 3.30గంటలకు ఇంద్రవెల్లిలోని అమరుల స్తూపం వద్దకు చేరుకుంటారు. గిరిజన అమరులకు నివాళులర్పించిన అనంతరం అమరుల స్మృతివనానికి భూమి పూజ చేసి పనులు ప్రారంభిస్తారు. 3.50నుంచి 4.50గంటల వరకు ఇంద్రవెల్లి అమరుల స్తూపం వద్ద బహిరంగసభలో పాల్గొని ప్రజలనుద్దేశించి ప్రసంగిస్తారు. అనంతరం 4.55గంటలకు హైదరాబాద్‌కు తిరుగుపయనమవుతారు.

కరెంట్‌ బిల్లు చెల్లించేదెవరు..!



నిర్వాసితులతో మాట్లాడుతున్న సీఐ రాజారెడ్డి

- పెండింగ్‌ బిల్లు రూ.6,59,240
- సరఫరా నిలిపేసిన విద్యుత్‌ అధికారులు
- అంధకారంలో గుండెగాం నిర్వాసితులు
- రోడ్డుపై గ్రామస్తుల నిరసన



రాస్తారోకో చేస్తున్న గుండెగాం నిర్వాసితులు

భైంసాటౌన్‌: ముంపు గ్రామమైన గుండెగాం నిర్వాసితులు నాలుగురోజులుగా అంధకారంలో మగ్గుతున్నారు. దీంతో రాత్రి వేళల్లో విష పురుగుల భయంతో చీకట్లో చిన్నపిల్లలతో బిక్కుబిక్కుమంటూ గడుపుతున్నామని, కరెంట్‌ లేకపోవడంతో బోరు మోటారు నీరు లేక స్నానాలకు, తాగునీటికి ఇబ్బందులు పడుతున్నామని వాపోతున్నారు. పల్సికర్‌ రంగారావు ప్రాజెక్టు నీటితో గ్రామం ఏటా ముంపునకు గురవుతుండడంతో అధికారులు భైంసా శివారులోని డబుల్‌బెడ్రూం ఇళ్లలో తాత్కాలిక నివాసం కల్పించిన విషయం తెలిసిందే. దీంతో దాదాపు రెండేళ్లుగా గ్రామానికి చెందిన సుమారు 200 కుటుంబాలు ఇక్కడ నివసిస్తున్నాయి. అయితే వీరు నివసిస్తున్న గృహ సముదాయానికి మొత్తానికి కలిపి ఒకే విద్యుత్‌ మీటర్‌ కనెక్షన్‌ ఉండడంతో బిల్లు ఎవరు చెల్లించాలనే సందిగ్ధత నివాసితుల్లో నెలకొంది. దీంతో ఏటికేడు విద్యుత్‌ బిల్లు పేరుకుపోతూ వస్తోంది. ప్రస్తుతం బకాయిలు రూ.6.59లక్షలకు చేరుకోవడంతో నాలుగురోజుల కిందట విద్యుత్‌ అధికారులు సరఫరా నిలిపేశారు. దీంతో విసిగిపోయిన నివాసితులు గురువారం భైంసా–మహాగాం రోడ్డుపై బైఠాయించిన నిరసన చేపట్టారు. దీంతో విషయం తెలుసుకున్న సీఐ రాజారెడ్డి, తహసీల్దార్‌ ప్రవీణ్‌కుమార్‌, ఆర్డీవో కోమల్‌రెడ్డి అక్కడికి చేరుకుని వారిని సముదాయించారు. విద్యుత్‌ అధికారులతో ఫోన్‌లో మాట్లాడగా, బిల్లు బకాయి ఉన్నట్లు పేర్కొన్నారు. దీంతో కనీస మొత్తమైనా చెల్లించాలని వారికి సూచించి అధికారులు అక్కడి నుంచి వెళ్లిపోయారు. విద్యుత్‌ సరఫరా నిలిపివేతపై ఏడీఈ ఆదిత్యను 'సాక్షి' ఫోన్‌లో వివరణ కోరగా, బిల్లు బకాయిపై ఆర్‌అండ్‌బీ అధికారులను పలుమార్లు కోరామని, అయితే, ప్రభుత్వం లబ్ధిదారులకు ఇండ్లు కేటాయించకపోవడంతో బిల్లు చెల్లింపు విషయం తమకు సంబంధం లేదని చెబుతున్నారని పేర్కొన్నారు. ప్రస్తుతం నివాసమున్నవారిని బిల్లు చెల్లించాలని కోరుతున్నా రెండేళ్లుగా బకాయిలు చెల్లించకపోవడంతో విద్యుత్‌ సరఫరా నిలిపేసినట్లు తెలిపారు. అంతమొత్తంలో బిల్లు ఎలా చెల్లించాలంటూ నిర్వాసితులు వాపోతున్నారు. ఉన్న ఊరు, గూడు కోల్పోయి ఇక్కడికి వచ్చామని, ప్రభుత్వం పునరావాసం త్వరగా కల్పిస్తే తమకు ఈ బాధ తప్పుతుందని చెబుతున్నారు. ప్రజాప్రతినిధులు తమను ఆదుకోవాలని కోరుతున్నారు.

బాబా ఆలయంలో పూజలు



పూజలు చేస్తున్న భక్తులు

కుంటాల: మండలంలోని కల్లూర్‌ సాయిబాబా ఆలయంలో గురువారం భక్తుల సందడి నెలకొంది. బాబాకు మంగళస్నానం, అభిషేకం, అలంకరణ తదితర పూజాది కార్యక్రమాలు నిర్వహించారు. గ్రామాల నుంచి మహిళలు పాదయాత్రగా ఆలయానికి వచ్చి మొక్కులు తీర్చుకున్నారు. అనంతరం ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు అన్నదానం చేశారు.

క్లుప్తంగా

4న ఉమ్మడి జిల్లా స్థాయి మెగా క్రికెట్ పోటీలు

జన్నారం: సంత్ సేవలాల్ మహరాజ్ 285వ జయంతి సందర్భంగా మండల కేంద్రంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా స్థాయి క్రికెట్ పోటీలను నిర్వహించనున్నట్లు సంత్ సేవలాల్ యువసేన నాయకులు బి.సాయికిరణ్, గంగాసింగ్, బద్రేశ్వర్‌లు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆసక్తి గల క్రీడాకారులు ఎంట్రి ఫీజు రూ.2వేలు చెల్లించి తమ పేర్లను నమోదు చేసుకోవాలని సూచించారు. పోటీలలో గెలుపొందిన జట్టుకు మొదటి బహుమతి రూ.50వేలు, ద్వితీయ బహుమతి రూ.25వేలు ఉంటుందని పేర్కొన్నారు. పోటీల ప్రారంభోత్సవానికి ఎమ్మెల్యే బొజ్జుపటేల్, మాజీ ఎంపీ రాథోడ్ రమేశ్, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్, బీఆర్‌ఎస్ ఇన్‌చార్జి జాన్సన్ నాయక్, రిటైర్డ్ ఐఏఎస్ అధికారి శర్మన్ నాయక్ హాజరవుతారని తెలిపారు. పూర్తి వివరాలకు సెల్: 93924 49041, 78935 56313లను సంప్రదించాలని కోరారు.

4న ఉమ్మడి జిల్లాస్థాయి ఖోఖో పోటీలు

నిర్మల్‌ఖిల్లా: జిల్లా ఖోఖో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా మహిళల, పురుషుల ఖోఖో జట్ల ఎంపిక పోటీలను ఈనెల 4వ తేదీన నిర్వహించనున్నట్లు ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఖోఖో అసోసియేషన్ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు గంద్రత్ ఈశ్వర్, శ్రీధర్ రెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. దిలావర్పూర్ మండలంలోని న్యూ లోలం గ్రామంలోని లిటిల్ స్కాలర్స్ హైస్కూల్‌లో ఉమ్మడి జిల్లా స్థాయి ఖోఖో జట్ల ఎంపిక పోటీలను నిర్వహిస్తామని పేర్కొన్నారు. ఈ పోటీలలో పాల్గొనే ఆసక్తి కలిగిన క్రీడాకారులు ఉదయం 10గంటలకు ఒరిజినల్ ఆధార్ కార్డు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలతో పాఠశాల ప్రధానోపాధ్యాయులు బి. సురేష్ కుమార్, వ్యాయామ ఉపాధ్యాయుడు రాజేందర్‌లను సంప్రదించాలని తెలిపారు. పోటీలలో ప్రతిభ చాటిన క్రీడాకారులను ఫిబ్రవరి 8 నుండి 11 తేదీ వరకు యాదాద్రి భువనగిరి జిల్లాలో నిర్వహించే రాష్ట్రస్థాయి సీనియర్ ఖోఖో పోటీలలో పాల్గొంటారని పేర్కొన్నారు. వివరాలకు 9398430685, 95738 66008 ఫోన్ నెంబర్లలో సంప్రదించాలని సూచించారు.

రాష్ట్రస్థాయి గణితశాస్త్ర పోటీల్లో భైంసా విద్యార్థిని ప్రతిభ



విద్యార్థిని సనా అఫ్రీన్‌ను అభినందిస్తున్న పాఠశాల ఉపాధ్యాయులు

భైంసాటౌన్: తెలంగాణ రాష్ట్ర గణితశాస్త్ర ఫోరం ఆధ్వర్యంలో నిర్వహించిన రాష్ట్రస్థాయిలో పోటీల్లో భైంసాలోని జెడ్పీహెచ్‌ఎస్ (ఉర్దూ మీడియం) బాలికల పాఠశాలకు చెందిన పదో తరగతి విద్యార్థిని సనా అఫ్రీన్ అత్యుత్తమ ప్రతిభ కనబర్చినట్లు ఫోరం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు చాట్ల శ్రీనివాస్, మనోహర్‌రెడ్డి తెలిపారు. శ్రీనివాస రామానుజన్ జయంతి సందర్భంగా జనవరి 31న నిర్వహించిన రాష్ట్రస్థాయి గణిత పోటీల్లో ఈ మేరకు భైంసా విద్యార్థిని రాష్ట్రస్థాయిలోనే మొదటి స్థానంలో నిలిచినట్లు పేర్కొన్నారు.

ఇంద్రవెల్లి నుంచే 'పునర్నిర్మాణం'

- మంత్రి సీతక్క
- ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలి



సమావేశంలో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

మంచిర్యాలటౌన్: పీసీసీ అధ్యక్షుడి హోదాలో రేవంత్‌రెడ్డి ఉమ్మడి జిల్లాలోని ఇంద్రవెల్లిలో మొదటి బహిరంగ సభ నిర్వహించగా, రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలోకి వచ్చిందని, అందుకే ప్రభుత్వం ఏర్పడిన తరువాత సీఎం హోదాలో ఇక్కడి నుంచే అభివృద్ధి మొదలు పెట్టబోతున్నారని రాష్ట్ర మహిళా, శిశు సంక్షేమ, పంచాయతీరాజ్ శాఖ మంత్రి, ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి దనసరి సీతక్క అన్నారు. మంచిర్యాల జిల్లా కేంద్రంలో ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు, డీసీసీ అధ్యక్షురాలు కొక్కిరాల సురేఖలతో కలిసి మాట్లాడారు. ప్రజల జీవన ప్రమాణాలను మెరుగుపరిచేందుకు నాడు ఉద్యమాల్లో పాల్గొన్నానని, చేయాల్సింది ఎంతో ఉందని తెలిపారు. దళిత గిరిజన దండోరాను ఇంద్రవెల్లి నుంచి పీఎస్సార్ ఆధ్వర్యంలో నిర్వహించగా, నేడు అధికారంలోకి వచ్చి మొట్టమొదటి సభను కూడా ఆయన ఆధ్వర్యంలోనే నిర్వహిస్తున్నామన్నారు. దివంగత సీఎం వైఎస్.రాజశేఖరరెడ్డి జలయజ్ఞంలో భాగంగా ఎన్నో ప్రాజెక్టులు మంజూరు చేశారన్నారు. ప్రాణహిత చేవెళ్ల ప్రాజెక్టు తెస్తే, బీఆర్‌ఎస్ ప్రభుత్వం దానిని కాళేశ్వరంగా మార్చి అవినీతికి పాల్పడిందని ఆరోపించారు. ఉమ్మడి జిల్లాలోని ఆసుపత్రుల్లో కనీసం వైద్యులు లేరని, స్టాఫ్‌నర్సులను నియమించే నోటిఫికేషన్ ఇచ్చేందుకు గత ప్రభుత్వానికి పదేళ్లు పట్టిందన్నారు. నిరుద్యోగులకు నోటిఫికేషన్లు ఇస్తున్నామంటూ ఓట్లు దండుకునే ప్రయత్నం చేశారని, అందుకే కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టారన్నారు.

సాగునీటి ప్రాజెక్టులపై నిర్లక్ష్యం..

బీఆర్‌ఎస్ పాలనలో సాగునీటి ప్రాజెక్టులు నిర్లక్ష్యానికి గురయ్యాయని ఆరోపించారు. కడెం ప్రాజెక్టును పట్టించుకోలేదని పేర్కొన్నారు. తమ ప్రభుత్వం మరమ్మతులకు నిధులు విడుదల చేసిందన్నారు. గత ప్రభుత్వం ప్రజలను, కనీసం మంత్రులు, ఎమ్మెల్యేలను కలిసే అవకాశం ఇవ్వలేదన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు వేతనాలు కూడా సకాలంలో ఇవ్వలేదని గుర్తు చేశారు. మహిళలకు ఉచితంగా బస్సు ప్రయాణం కల్పిస్తే, బీఆర్‌ఎస్ నేతలు అక్కసుతో ఆటో డ్రైవర్లను రెచ్చగొడుతున్నారని విమర్శించారు. ఆటో డ్రైవర్ల కుటుంబాలు కూడా ఉచిత బస్సు ప్రయాణాన్ని సద్వినియోగం చేసుకుంటున్నారని తెలిపారు. కోదండరామ్‌కు ఎమ్మెల్సీ ఇస్తే అక్కసుతో అడ్డుకుంటున్నారని విమర్శించారు.

ఇంద్రవెల్లి సభ విజయవంతం చేయాలి

ఇంద్రవెల్లి సభను విజయవంతం చేయాలని మంచిర్యాల ఎమ్మెల్యే కొక్కిరాల ప్రేమ్‌సాగర్‌రావు కోరారు. రేవంత్‌రెడ్డి పీసీసీ అధ్యక్షుడిగా మొట్టమొదటి సభను 2021, ఆగస్టు 9న ఇంద్రవెల్లిలో సభ నిర్వహించారని గుర్తుచేశారు. మళ్లీ నేడు సీఎం హోదాలో ఇంద్రవెల్లికి వస్తున్నారని తెలిపారు. మంచిర్యాల నియోజకవర్గంలో గత ఎమ్మెల్యే పదేళ్లలో పది ఎల్‌వోసీలు ఇవ్వగా తాను కేవలం నెల రోజుల్లోనే 33 ఎల్‌వోసీలు ఇచ్చానని తెలిపారు. సీఎం సభకు 135 బస్సులు, 150 వాహనాల్లో ప్రజలను తరలిస్తున్నట్లు తెలిపారు. నియోజకవర్గంలోని ఆటో డ్రైవర్లు, ఓనర్లకు ఈనెల 10వ తేదీ తర్వాత ఉచితంగా బీమా చేయిస్తానని పేర్కొన్నారు. ఏదైనా కారణంతో చనిపోతే రూ.15 లక్షలు బాధిత కుటుంబానికి అందతాయని తెలిపారు. సమావేశంలో ఐఎన్టీయూసీ అధ్యక్షుడు జనక్‌ప్రసాద్, డాక్టర్ గణేశ్‌రాథోడ్, మంచిర్యాల మున్సిపల్ ఫ్లోర్ లీడర్ రావుల ఉప్పలయ్య పాల్గొన్నారు.

ఎంపీని కలిసిన రైల్వే లైన్ కమిటీ సభ్యులు

నిర్మల్‌చైన్‌గేట్: ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ సాధన సమితి కమిటీ గురువారం న్యూఢిల్లీలో నిజామాబాద్ లోక్ సభ సభ్యులు ధర్మపురి అరవింద్‌ని కలిశారు. ఆదిలాబాద్ టు ఆర్మూర్ రైల్వే లైన్ నిధులు బడ్జెట్‌లో ప్రవేశ పెట్టడానికి లోక్ సభలో మాట్లాడాలని కోరారు. అందుకు ఎంపీ సానుకూలంగా స్పందించి రైల్వే మంత్రి దృష్టికి తీసుకెళ్లి నిధులు ఇప్పించేందుకు కృషి చేస్తానని తెలిపారు. కమిటీ కన్వీనర్ డాక్టర్ ఈసవేణి మనోజ్ యాదవ్, కోకన్వీనర్లు యాటకారి సాయన్న, మూర్తి ప్రభాకర్, నిమ్మ గణేష్, సయ్యద్ చాంద్ పాషా లు ఉన్నారు.

నేడు ఓటరు పరిశీలకురాలి రాక

కైలాస్‌నగర్: ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఓటరు జాబితా పరిశీలకురాలుగా నియమాకమైన భారతి లక్పతి నాయక్ ఈ నెల 2న నిర్మల్ జిల్లాకు రానున్నట్లు కలెక్టర్ రాహుల్ రాజ్ ఒక ప్రకటనలో గురువారం తెలిపారు. మధ్యాహ్నం 12గంటలకు నిర్మల్ జిల్లా కేంద్రంలోని సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహిస్తారన్నారు. అధికారులు ఈ సమావేశానికి సకాలంలో హాజరుకావాలని కోరారు.

పశుసంవర్ధక శాఖ కార్యాలయం ముట్టడి

- గొర్రెల పంపిణీ చేయాలని గొల్ల, కురుమల ఆందోళన
- అధికారులను లోపల ఉంచి తాళం వేసిన వైనం



కార్యాలయ ఆవరణలో నిరసన తెలుపుతున్న నాయకులు

ఆదిలాబాద్‌టౌన్: జిల్లా పశుసంవర్ధక శాఖ కార్యాలయాన్ని గొల్ల, కురుమలు గురువారం ముట్టడించారు. రెండో విడత గొర్రెల పంపిణీ చేయాలని డిమాండ్ చేశారు. అధికారులు లోపల ఉన్న సమయంలో బయట నుంచి కార్యాలయానికి తాళం వేసి అధికారులు బయటకు రాకుండా అడ్డుకున్నారు. కార్యాలయ ఆవరణలో ఆందోళనకు దిగారు. యాదవ సంఘం జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రఘువీర్ యాదవ్, హనుమాండ్లు యాదవ్‌లు మాట్లాడుతూ బీఆర్‌ఎస్ ప్రభుత్వం గొల్ల, కురుమలకు రెండో విడత గొర్రెల పంపిణీ కార్యక్రమం కోసం డీడీలు కట్టించి 18 నెలలు గడుస్తున్నా ఇప్పటివరకు ప్రారంభం కాలేదని పేర్కొన్నారు. జిల్లా పర్యటనకు వస్తున్న ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి గొల్ల, కురుమల పట్ల సానుకుల నిర్ణయం తీసుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షుడు నారాయణ యాదవ్, జిల్లా యువజన అధ్యక్షుడు వేణుగోపాల్ యాదవ్, దేవ రెడ్డి యాదవ్, మంచాల మల్లయ్య యాదవ్, అసుర రమేష్ యాదవ్ పాల్గొన్నారు.

జేఎల్‌ఎం భర్తీ ప్రక్రియ మళ్లీ షురూ



పోల్ క్లైమింగ్ పరీక్షలో పాల్గొన్న అభ్యర్థులు

ఆదిలాబాద్‌టౌన్: కోర్టు తీర్పు కారణంగా కొన్నేళ్ల క్రితం వాయిదపడిన జూనియర్ లైన్‌మెన్ (జేఎల్‌ఎం) ఉద్యోగుల భర్తీ ప్రక్రియను మళ్లీ చేపట్టారు. గురువారం జిల్లా కేంద్రంలోని ఎస్‌ఈ కార్యాలయ ఆవరణలో పోల్ క్లైమింగ్ పరీక్ష నిర్వహించారు. ఈ పరీక్షకు 43 మంది అభ్యర్థులకు గాను ఐదుగురు గైర్హాజరయ్యారు. గతంలో రిజర్వేషన్ విషయమై పలువురు జేఎల్‌ఎం అభ్యర్థులు కోర్టును ఆశ్రయించిన విషయం విధితమే. అయితే కోర్టులో కేసు ఉన్న కారణంగా భర్తీ ప్రక్రియ నిలిచిపోయింది. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా 43 మందికి భర్తీ విషయంలో తాజాగా కోర్టు ఆదేశాలతో ప్రక్రియను చేపట్టారు. ఈ సందర్భంగా ఎస్‌ఈ జేఆర్ చౌహాన్ మాట్లాడుతూ అభ్యర్థులకు పోల్ క్లైమింగ్ పరీక్ష నిర్వహించారు. అయితే ఇందులో ఓ అభ్యర్థి స్తంభాన్ని బాగానే ఎక్కినప్పటికి బ్యాలెన్స్ కోల్పోవడంతో పట్టుతప్పి కింద పడిపోయే పరిస్థితి ఏర్పడింది. ఏర్పాటు చేసిన తాడు సాయంతో ప్రమాదం నుంచి బయటపడ్డాడు.

రైల్వే సదుపాయం కల్పించడంలో కేంద్రం విఫలం



సంఘీభావం ప్రకటిస్తున్న రామ్‌కిషన్ నాయక్

ఆదిలాబాద్: జిల్లాలో మెరుగైన రైల్వే సదుపాయాలను కల్పించడంలో కేంద్ర ప్రభుత్వం విఫలమైందని పరిశ్రమల శాఖ రిటైర్డ్ జనరల్ మేనేజర్ జాదవ్ రామ్ కిషన్ నాయక్ అన్నారు. ఆదిలాబాద్–ఆర్మూర్ రైల్వే లైన్ నిర్మించాలని సాధన కమిటీ ఆధ్వర్యంలో జిల్లా కేంద్రంలోని ఆర్‌అండ్‌బీ వద్ద చేపడుతున్న రిలే నిరాహార దీక్షలకు గురువారం ఆయన సంఘీభావం ప్రకటించి మాట్లాడారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాలో తూర్పు ప్రాంతమైన మంచిర్యాల నుంచి కాగజ్‌నగర్ వరకు మాత్రమే రైల్వే సౌకర్యం ఉందని పేర్కొన్నారు. ఇప్పటికైనా కేంద్ర ప్రభుత్వం ముందుకు వచ్చి రైల్వే లైన్ మంజూరు చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో సాధన కమిటీ చైర్మన్ నారాయణ యాదవ్, దామెర కనకారావు, విజయసాగర్, మడావి లక్ష్మీకాంత్ ఉన్నారు.

రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి గాయాలు

బేల: మండలంలోని గణేష్‌పూర్ గ్రామ శివారులోని బ్రిడ్జి వద్ద బుధవారం రాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ముగ్గురికి తీవ్ర గాయాలయ్యాయి. ఈ బ్రిడ్జి వద్ద ఆటో, ట్రాక్టర్ ఎదురెదురుగా ఢీకొన్నాయి. ఆటోలో ప్రయాణిస్తున్న 10మందిలో ఆ గ్రామ సర్పంచ్ మడావి భీంబాయి, మడావి సీతబాయి, కొడప అయ్యుబాయిలకు తీవ్ర గాయాలయ్యాయి. స్థానికులు మెరుగైన వైద్యం కోసం వారిని జిల్లా కేంద్రంలో ప్రైవేటు ఆసుపత్రులకు తరలించారు.

ఇద్దరికి గాయాలు..

జైనథ్: మండలంలోని గిమ్మ ఎక్స్ రోడ్ సమీపంలో గురువారం జరిగిన రోడ్డు ప్రమాదంలో ఇద్దరు వ్యక్తులకు తీవ్ర గాయాలయ్యాయి. పోలీసుల వివరాల ప్రకారం... ఆదిలాబాద్‌కు చెందిన ఎస్‌కే గఫర్, మహారాష్ట్ర బోరిలో పనిచేస్తున్నాడు. పనులు ముగించు కొని మహారాష్ట్ర నుండి ఆదిలాబాద్‌కు బైక్‌పై తిరుగు ప్రయాణమయ్యాడు. ఈ క్రమంలో గిమ్మ ఎక్స్‌రోడ్ సమీపంలో మహారాష్ట్రలోని నాందేడ్‌కు చెందిన నరేష్ ఎదురుగా రాంగ్‌రూట్‌లో బైక్‌పై వచ్చి ఢీకొన్నాడు. దీంతో ఇద్దరు జాతీయ రహదారిపై పడిపోగా తీవ్ర రక్తగాయాలయ్యాయి. ఇద్దరిని 108లో జిల్లా కేంద్రంలోని రిమ్స్‌కి తరలించారు. గఫర్ కుమారుడు సమీర్ ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకొని దర్యాప్తు ప్రారంభించినట్లు ఎస్సై పురుషోత్తం తెలిపారు.

రోడ్డు ప్రమాదంలో ఒకరి మృతి

నిర్మల్‌రూరల్: మండలంలోని చిట్యాల వద్ద బుధవారం అర్ధరాత్రి జరిగిన రోడ్డు ప్రమాదంలో ఒకరు మృతిచెందగా పలువురికి గాయాలైనట్లు రూరల్ ఎస్సై చంద్రమోహన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం... సారంగాపూర్ మండలం ధని గ్రామానికి చెందిన పాకాల రాజారాం(60) కుటుంబ సభ్యులతో కలిసి కాల్వ గ్రామానికి తమ్ముడి దినకర్మకు వెళ్లాడు. కార్యక్రమం తర్వాత అదే గ్రామానికి చెందిన ఆటో మాట్లాడుకుని అర్ధరాత్రి తన కుటుంబ సభ్యులతో కలిసి ధని గ్రామానికి వస్తుండగా మండలంలోని చిట్యాల గ్రామం పెట్రోల్ బంకు వద్ద భైంసా నుంచి నిర్మల్‌కు వెళ్తున్న కారు వెనుక నుంచి ఆటోను ఢీకొట్టింది. దీంతో ఆటో బోల్తా పడింది. పాకల రాజారాం తీవ్ర గాయాలు కావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మరో పది మంది కుటుంబ సభ్యులు గాయపడ్డారు. గాయపడ్డవాడిని 108లో జిల్లా కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి చికిత్స అందిస్తున్నారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

వృద్ధురాలి అదృశ్యం

ఆదిలాబాద్‌రూరల్: మావల పోలీస్ స్టేషన్ పరిధిలోని కేఆర్‌కే కాలనీలోని వృద్ధాశ్రమంలో ఉంటున్న పార్వతి (77) అదృశ్యమైనట్లు ఎస్సై విష్ణువర్ధన్ తెలిపారు. ఆయన కథనం ప్రకారం.. కేఆర్‌కే కాలనీ వృద్ధాశ్రమంలో ఉంటున్న పార్వతి బుధవారం కిరాణా షాప్‌కు వెళ్తున్నానని చెప్పింది. రాత్రి వరకు తిరిగి రాకపోవడంతో నిర్వాహకులు గురువారం ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై వివరించారు.

గుడుంబా తయారీ కేంద్రాలపై దాడులు

మామడ: మండలంలోని జయరాంతండాలో గుడుంబా తయారీ కేంద్రాలపై గురువారం ఎక్సైజ్ అధికారులు దాడులు నిర్వహించారు. గుడంబాను స్వాధీనం చేసుకుని బెల్లంపానకాన్ని ధ్వంసం చేశారు. గుడుంబా తయారు చేస్తున్న ఒకరిపై కేసు నమోదు చేశారు. ఈ కార్యక్రమంలో ఎక్సైజ్ ఎస్‌ఐ రాయబారపు రవికుమార్, సిబ్బంది నరేందర్, భాస్కర్ ఉన్నారు.

సమయపాలన పాటించని ఉపాధ్యాయురాలు

పెంబి: మండలంలోని వేణునగర్ (కొత్త చెరువుగూడా) గ్రామ పంచాయతీలోని మండల పరిషత్ ప్రాథమిక పాఠశాలలో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయురాలు రమ్య సమయపాలన పాటించడం లేదని వైస్ ఎంపీపీ గంగారెడ్డి తెలిపారు. గురువారం మధ్యాహ్నం 2గంటల 40 నిమిషాలకే ఉపాధ్యాయురాలు ఇంటి బాట పంటిందన్నారు. పాఠశాలలోని గిరిజన విద్యార్థులకే సరైన విద్యా అందడం లేదని, పలుమార్లు ప్రశ్నించినా ఉపాధ్యాయురాలి తీరు మారడం లేదన్నారు. దీనిపై సాక్షి ఎంఈవో మధుసూదన్‌ని వివరణ కోరగా ఉపాధ్యాయురాలు మాకు ఎలాంటి సమాచారం ఇవ్వలేదని, సదరు ఉపాధ్యాయురాలి పై తగు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

నిరాశపర్చిన బడ్జెట్

ఆదిలాబాద్‌టౌన్: కేంద్ర ప్రభుత్వం తాజాగా ప్రవేశపెట్టిన బడ్జెట్ వేతన జీవులను పూర్తిగా నిరాశపర్చిందని తెలంగాణ రాష్ట్ర టీచర్ ఫెడరేషన్ (టీఆర్‌టీఎఫ్) జిల్లా అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు రామగిరి శివకుమార్, సల్ల సురేందర్ రెడ్డి ఒక ప్రకటనలో పేర్కొన్నారు. ఈ బడ్జెట్‌లో ఒక్క వెసులుబాటు కూడా కల్పించలేదని, కొత్త పన్నుల విధానంలో 80సి, 80డి, ఇంటి అద్దె, విద్య, గృహ రుణాలపై వడ్డీ తదితర మినహాయింపులు వర్తింపుజేయాలని మూడేళ్లుగా సంఘాలు కోరుతున్నా పట్టించుకోకపోవడం అన్యాయమని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రత్యక్ష పన్ను మినహాయింపు పరిమితిని రూ.10 లక్షలకు పెంచాలని డిమాండ్ చేశారు.

కుభీర్‌లో ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్ ఫ్లాగ్‌మార్చ్

కుభీర్: మండల కేంద్రంలో రానున్న ఎంపీ ఎన్నికలను దృష్టిలో ఉంచుకుని గురువారం ర్యాపిడ్ యాక్షన్ ఫోర్స్, పోలీసులు ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. ప్రజలకు మేమున్నామనే భరోసా, శాంతిభద్రతలను కాపాడటం, ప్రజల్లో ఉన్న అభద్రత భావాన్ని తొలగించడం కోసం కవాతు నిర్వహించడం జరిగిందని ఎస్సై ఎండీ.షరీఫ్ తెలిపారు.

సీఎం సభను విజయవంతం చేయండి

నేరడిగొండ: ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి శుక్రవారం ఇంద్రవెల్లిలో నిర్వహించే సభకు జిల్లా నుంచి పెద్ద ఎత్తున నాయకులు, కార్యకర్తలు తరలివచ్చి విజయవంతం చేయాలని వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ అన్నారు. గురువారం నేరడిగొండ మండల కేంద్రంలో నాయకులు, కార్యకర్తలతో నిర్వహించిన సన్నాహక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రిగా రేవంత్ రెడ్డి బాధ్యతలు చేపట్టిన తర్వాత మొదటిసారి ఇంద్రవెల్లి వేదికగా అభివృద్ధిని ఓ ఉద్యమంలా తీసుకెళ్లేందుకు వస్తున్నారన్నారు. ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ చేపట్టిన అభివృద్ధి పనులే నేటికీ గ్రామాల్లో దర్శనమిస్తున్నాయని తెలిపారు. సమావేశంలో కాంగ్రెస్ పార్టీ బోథ్ నియోజకవర్గ నాయకులు ఆడె గజేందర్, తుల అరుణ్ కుమార్, ఆ పార్టీ మండల కన్వీనర్ ఆడె వసంత్‌రావు, జిల్లా నాయకులు అల్లూరి ప్రఫుల్‌చందర్ రెడ్డి, వకీల్, అనుపట్ల సంజీవ్ కుమార్, నాయిడి రవి, పాల శంకర్, రాథోడ్ రవిందర్, బోలిశెట్టి రాములు, బుక రాములు, ఈర్ల శ్రీకాంత్, బొర్ర నవీన్ పాల్గొన్నారు.

రాగితీగల చోరీ

నార్నూర్: మండలంలోని మహాగావ్ గ్రామ సమీపంలోని వ్యవసాయ పొలంలో విద్యుత్ శాఖ అమర్చిన 25కేవీ ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి విద్యుత్ తీగలను బుధవారం రాత్రి గుర్తు తెలియని వ్యక్తులు దొంగిలించారు. విద్యుత్ శాఖ ఏఈ శ్రీనివాస్, రైతుల వివరాల ప్రకారం ... 25కేవీ విద్యుత్ ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం విద్యుత్ కలెక్షన్ తొలగించారు. గురువారం ఉదయం ట్రాన్స్‌ఫార్మర్ మరమ్మతుల కోసం ఆదిలాబాద్ తీసుకెళ్లేందుకు రైతులతో కలిసి ట్రాన్స్‌ఫార్మర్ ఉన్న చోటుకి వెళ్లగా పగలగొట్టి ఉంది. ట్రాన్స్‌ఫార్మర్‌లోని రాగి తీగలను దొంగలించారని, ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేయనున్నట్లు ఏఈ వివరించారు.

మహాలక్ష్మికి బోనాలు





తానూరు: మండల కేంద్రంలో గ్రామ దేవతలకు గురువారం బోనాలు సమర్పించారు. ప్రతి ఏడాది మాదిరిగానే ఈసారి గురువారం ఉదయం మహాలక్ష్మి ఆలయంలో అభిషేకం నిర్వహించి పూజలు చేశారు. సాయంత్రం విఠలేశ్వర ఆలయం నుంచి మహాలక్ష్మి ఆలయం వరకు ఆయా విధుల నుంచి భక్తులు బోనాలు ఎత్తుకొని డప్పు వాయిద్యాలతో భేరి చెప్పళ్లతో గజ్జలలాగులు ధరించి నృత్యాలు చూస్తూ ఆలయం వద్ద సందడి చేశారు. దేవతామూర్తులకు నైవేద్యం సమర్పించి మొక్కులు తీర్చుకున్నారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు తదితరులు ఉన్నారు.

శభాష్ శ్రీలత మేడమ్...



సీసీ కెమెరాలతో ఉపాధ్యాయులు

ఖానాపూర్: పట్టణంలోని ప్రభుత్వ బాలికల ఉన్నత పాఠశాలలో పనిచేసే ఉపాధ్యాయురాలు ఎ.శ్రీలత పాఠశాలలో రూ.15వేల విలువైన సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించి ఉదారతను చాటారు. పాఠశాలలో ఇదివరకే 10 కంప్యూటర్లు ఉన్నప్పటికీ, ఇటీవల దాతల ద్వారా మరో 10కంప్యూటర్లు సమకూరాయి. బాలికల పాఠశాల కావడంతో పాటు కంప్యూటర్లు విలువైనవి కావడంతో గతంలో పాఠశాల కంప్యూటర్ గదిలో చోరీ జరిగిన విషయాన్ని దృష్టిలో ఉంచుకొని ఇరువురి రక్షణ వంటి చర్యల కోసం తన సొంత డబ్బులతో సీసీ కెమెరాలను ఏర్పాటు చేయించారు. దీంతో ఉపాధ్యాయురాలు శ్రీలతను పాఠశాల విద్యార్థులతో పాటు తోటి ఉపాధ్యాయులు, స్థానికులు శభాశ్ శ్రీలత మేడమ్ అని అభినందిస్తున్నారు. కార్యక్రమంలో హెచ్‌ఎం సంధ్యారాణి, తదితరులు ఉన్నారు.

రూ.2.29కోట్ల వేతనాలు విడుదల



మాట్లాడుతున్న అర్క వసంత్‌రావు

ఉట్నూర్‌రూరల్: బీఆర్‌ఎస్ ప్రభుత్వ హయంలో వేతనాలు విడుదల కాక ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొన్న ఐటీడీఏ పెసా కోఆర్డినేటర్లు, మొబలైజర్లకు వేతనాలు ఇవ్వాలని సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడంతో రూ. 2.29 కోట్ల నిధులు విడుదల చేశారని ఉట్నూర్ ఐటీడీఏ ఉమ్మడి జిల్లా పెసా కోఆర్డినేటర్ అర్క వసంత్‌రావు తెలిపారు. గురువారం స్థానిక ప్రెస్ భవన్‌లో మాట్లాడారు. కాంగ్రెస్ ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ఖానాపూర్ ఎమ్మెల్యే బొజ్జు ఆధ్వర్యంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క దృష్టికి తీసుకువెళ్లిగా మూడేళ్లుగా పెండింగ్‌లోని వేతనాలు విడుదల చేసినట్లు తెలిపారు. ఇందులో మొబలైజర్లు భరత్ భూషన్, విగ్నేశ్, తెలంగ్‌రావు, మారుతి, జంగు, తానాజీ, శంకర్, చిత్రు ఉన్నారు.

జిల్లాలో కాంగ్రెస్‌కు పూర్వవైభవం

- ఎమ్మెల్సీ మహేష్ కుమార్ గౌడ్



మాట్లాడుతున్న మహేష్ కుమార్‌గౌడ్

కైలాస్‌నగర్: గతంలో కాంగ్రెస్‌కు కంచుకోటగా నిలిచిన ఆదిలాబాద్ జిల్లాలో పార్టీ పూర్వవైభవం సంతరించుకుంటుందని ఎమ్మెల్సీ, టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్‌కుమార్ గౌడ్ అన్నారు. గురువారం రాత్రి జిల్లా కేంద్రంలోని ప్రజాసేవా భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాట్లాడారు. టీపీసీసీ అధ్యక్ష బాధ్యతలు చేపట్టాక రేవంత్ రెడ్డి అసెంబ్లీ ఎన్నికల సమరశంఖం ఇంద్రవెల్లి పురిటిగడ్డ నుంచే పూరించారన్నారు. మళ్లీ పార్లమెంట్ ఎన్నికల సమరశంఖారావాన్ని శుక్రవారం ఇక్కడి నుంచే పూరించనున్నారన్నారు. సమావేశంలో సభ ఇన్‌చార్జి పటేల్ రమేష్ రెడ్డి, డీసీసీబీ చైర్మన్ అడ్డి భోజారెడ్డి, బాలురి గోవర్ధన్‌రెడ్డి పాల్గొన్నారు.

ఉపాధి అవకాశాలపై అవగాహన



అవగాహన కల్పిస్తున్న ట్రైనర్ దేవేందర్

కడెం: మండలంలోని ధర్మాజీపేట్ గ్రామంలో గురువారం ఎంటర్‌ప్రెన్యూర్‌షిప్ డెవలప్‌మెంట్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ ఇండియా సంస్థ (ఈడీఐఐ) ఆధ్వర్యంలో మహిళలకు జీవనోపాధి అవకాశలపై అవగాహన నిర్వహించారు. చేపల పెంపకం, వలలు అల్లడం, చేపల పచ్చడి, ఎండు చేపల మార్కెటింగ్, చేపనూనే తయారీ విధానాలపై శిక్షణ కార్యక్రమం ఉంటుందని ఈడీఐఐ మాస్టర్ ట్రైనర్ దేవేందర్ నాయక్ పేర్కొన్నారు. శిక్షణ అనంతరం ఫుడ్ లైసెన్స్‌లతో పాటు సంస్థ తరఫున అన్ని రకాల సహకారం ఉంటుందని తెలిపారు.